కథానిక:

# వెన్నంటిన చీకటి ఛాయలు

ఇక దొంగతనాలు చేయకూడదూ బుద్ధిగా వుండాలనుకొన్న వాడు, ఒక మిత్రుడి భార్యను కాపాడడానికి తిరిగి దొంగతనము చేయవలసివచ్చింది. అయితే ఆ దొంగతనం చేసింది ఎవరి వస్తువు?... దాంతో అతను కోల్పోయిన దేమిటి?

జైల్లో నేలమీాల బోర్లా పడుకొని ఈలవేసుకుంటూ తన్మయత్వంలో మునిగివున్న గోపీకి 'తమ్ముడూ!' అనే పిలుపు వినిపించగానే ఉలికిపడి లేచాడు. ఎవరు! కళ్ళు నులుముకు మరీ చూచాడు. అదే ఆకారం! పదేళ్ళ నాటికీ ఇప్పటికీ ఏం మార్పులేదు హృదయం గబగబా కొట్టుకోసాగింది. మాట్లాడేందుకు నోరు పెగల్లేదు. తన అన్నయ్య... మాధవన్నయ్య! ఏన్నాళ్లకగుపించాడు. సంభ్రమాశ్చర్యాలకు లోనవుతూ 'అన్నయ్యా!' అన్నాడు గద్గదమైన కంఠంతో.

'గోపీ... ఎన్నాళ్ళకగుపించావురా!' మాధవ చెక్కిళ్లు కన్నీటితో తడిశాయి.

'నేనిక్కడున్నానని ఎవరు చెప్పారన్నయ్యా!'

'ఈ జైలు అధికారి నా మిత్రుడికి బంధువు. అతనింటికి వచ్చి జైలు చూడాలని వచ్చాము. నీవు కన్పించావు.'

'అమ్మ నాన్న బావున్నారా అన్నయ్యా!'

'అమ్మ లేదు గోపీ! నిన్ను తలచుకుంటూనే కన్ను మూసింది.'

'నేను దుర్మార్గుణ్ణి అన్నయ్యా! తలితండ్రులకు గౌరవం తెచ్చి పరువు మర్యాదలు మంటగలిపాను. చివరకు తన్నుగన్న తల్లిని కడసారిగా చూచేందుకు కూడా నోచుకోలేకపోయాను!' కళ్లలో నీళ్ళు నిండాయి.

'జరిగినదానికి విచారించి లాభంలేదు గోపీ! నీ కింకెప్పుడు విడుదల ఎప్పుడు!'

'మూణ్ణెల్లు పడుతుంది.'

'నీవు పెద్దవాడివయ్యావు గోపీ! నీమాటల్ని బట్టి చూస్తే జరిగిందానికి పశ్చాత్తాపం చెందుతున్నావనే అనుకుంటున్నాను. చదువు ఎక్కువ లేకపోయినా నీకు తెలివికేం లోటు లేదు. మన కుటుంబ గౌరవాన్ని అమ్మ నాన్నలన్నైన మనస్సులో తలుచుకొని ఈ పని మానేసి ఇంటికి వచ్చేసెయ్ గోపీ! మన పొలం సేద్యం చేసుకొని హాయిగా బ్రతకొచ్చు.'

రచన:

పి. కళ

'నా మీాద నీ కెందుకంత నమ్మకం అన్నయ్యా!'

'అన్నాదమ్ములం మనల్ని మనం నమ్మకపోతే ఇంకెవర్ని నమ్మాలి గోపీ!'

'నేనంత అదృష్టవంతుణ్ణా... అన్నయ్యా నీకు పెళ్ళయిందా?'

'ఆ...నిన్ను చిన్నాన్నా అని పిలిచే ఓ అమ్మాయి కూడా...'

'నా రాకను...ఒకవేళ జేబుదొంగ ఇంట్లో అడుగు పెట్టడాన్నికి వదిన ఆమోదించుతుందా!'

'ఆమోదం కాదు గోపీ ప్రమోదం పొందుతుంది. నిన్ను తన కుమారుడిలా చూచుకుంటుంది నీ కా భయం క్కర్లేదు గోపీ!'

'తప్పకుండా ఇంటికి వచ్చేస్తానన్నయ్యా! ఇంక నేనీ జీవితాన్ని గడపలేను. నేను మానవుళ్ళా బ్రతకాలి! ఇంకెప్పుడూ దొంగతనాలూ దుర్మార్గపు పనులూ చేయను' ఆ కంఠంలో దృఢనిశ్చయం ధ్వనించింది

'నీ రాక వింటే నాన్నకు అమృతం చిలికినట్లే ఉంటుంది. నాకు చాల సంతోషంగా ఉంది తమ్ముడూ! నే మళ్ళీ నిన్ను చూసేందుకు వస్తానులే!' అంటూ తమ్ముడి దగ్గర వీడ్కోలు తీసుకొని జైలు అధికారితో కలిసి తమ్ముని విషయం చెప్ప వెళ్ళిపోయాడు మాధవరావు.

అన్నయ్య రాకడా పోకడా ఓ కలలా తోచింది గోపీకి. గుర్తొస్తే శరీరం పులకించి హృదయంలో ఆనందం కట్టలు తెంచుకొని ప్రవహించుతుంది. తన అన్నయ్య ఎంత మంచివాడు! పేదవాడైన బంధువునే తన వాడని చెప్పుకోడానికి భిడియపడే ఈరోజుల్లో తనలాటి దొంగని తమ్ముడని చెప్పుకోడాని కేమాత్రం సంకోచించలేదు. తను మంచి ఉద్యోగం చేస్తూకూడా ఇంట్లో పెట్టుకోడానికి సందేహించడంలేదు. తన వాళ్ళంతా మంచి వాళ్ళే తనే వట్టి దుర్మార్గుడు. చిన్నవాడని అమ్మ నాన్న అపురూపంగా పెంచారు. అందుకే భయం భక్తీ లేకుండా విచ్చలవిడిగా ప్రవర్తించాడు. చిన్నతనంలో పలకలూ బలపాలతో మొదలై పెట్టెల్లో డబ్బులవరకూ వెళ్ళింది వ్యవహారం. క్రమక్రమంగా వయస్సు వొచ్చిన కొద్దీ చదువుమీాద శ్రద్ధ తగ్గి వ్యసనాలపై చూపు మొగ్గింది. ఎలాగో రెండేళ్లు తప్ప మూడో యేడు హైస్కూల్లో జాయినయినా ఆ పరిసరం, మిత్రులు తన అభిరుచులకనుగుణంగానే తయారయ్యారు. అన్నయ్య ఎప్పుడైనా బుద్ధిచెప్పబోయినా పెద్ద చిన్నా అనే గౌరవాన్ని మదిలో తలపక తిరగబడే వాడు. తల్లిదండ్రీ కన్నులు కెంపుబారి కే

పరిస్థితి విషమించింది. సిగరెట్లు ఎదురుగానే కాల్చడం, పేక జేబులో వేసుకు తిరగడం చూచి తామిలా పెంచినందుకు ఏడవటంతప్ప ఏం చేయలేకపోయేవారు. ఇలా జరుగుతూండగానే పొలంలో వచ్చిన వెయ్యిరూపాయిలూ తీసుకొని ఓ రాత్రి అంతర్థానమయ్యాడు. ఆ డబ్బు అయిపోయేవరకూ దుర్వ్యసనాలతో కాలం గడిపాడు. ఆ రోజుల్లోనే చాలా మంది పరిచయం సంపాదించాడు. డబ్బు ఉన్నప్పుడు తిని అది అయిపోయాక జేబులు కొట్టే ఉపాయాలు నేర్పి దొంగగా తయారు చేసారు

తన స్వగ్రామాన్ని తల్లిదండ్రులనూ అన్నయ్యనూ చూడాలని మనస్సులో ఉన్నా ఏముఖంతో వెళ్ళాలి! ఇదివరకు చేసిన పనేమిటి! ఇప్పుడుచేసే ఉద్యోగమేమిటి! తను జేబుదొంగ. తెలియని అహంకారంతో ఇప్పటికే చాల అపయశం తెచ్చిపెట్టాడు. ఇప్పుడు వెళ్ళడంవలన తన సొంత నీచంగా చూస్తారు! తల్లిదండ్రులు గడపతొక్కొద్దు పొమ్మంటే ఏం చేయాలి! పరువు మర్యాదకై ప్రాణాలిచ్చే తనవారు ఆదరించుతారా! తెలియని వాళ్లు దొంగ అన్నా కొట్టినా తిట్టినా సహించడం కష్టంకాదు. కాని తెలిసిన వాళ్ళలో ఎలా తలెత్తుకు తిరగాలి! అందుకే వెళ్ళలేకపోయాడు. సంవత్సరం క్రితం ఓ సేట్ గారి పర్సు కొట్టేసి పట్టుబడి తత్ఫలితంగా ఈ కటకటాలమధ్య కూర్చున్నాడు. తన అన్నయ్య కనిపించాడు. పైగా ఇంటికి రమ్మని ఆహ్వానించాడు. దొంగతనం చేయకుండా కష్టపడి జీవించాలని ఎన్నోసార్లు అనుకున్నాడు. కాని పరిసరాలు, పరిస్థితులూ, తన అవసరాలు మారనిచ్చాయికాదు. మంచిగా బ్రతకాలనుకున్నా బ్రతకలేకపోయాడు. ఇప్పుడు తనకీ ఓ మంచి అండ దొరికింది. కష్టసుఖాలకువాళ్ళే ఆదుకుంటారు! మొదట గ్రామస్థులు, బంధువులు తనను అసహ్యించుకొన్నా వాళ్ళను తన ప్రవర్తనచే మెప్పించి తన వారిగా చేసుకోవాలి. గోపీ ఆలోచన లెప్పుడూ ఇంటివైపే పరిగెత్తుతూండేవి. తను ఎలా మసులుకుంటే తన వాళ్ళకు దగ్గరౌతాడో ఆలోచించుకునేవాడు

తర్వాత మళ్ళీ రెండుసార్లు మాధవరావు వచ్చి చూచి వెళ్ళాడు. గోపీకి ఇష్టమైన మైసూర్ పాక్ లు సున్ని ముద్దలూ తెచ్చి తమ్ముడికి ఆదరంగా తినిపించాడు. అన్నయ్య స్వచ్ఛమైన హృదయం, నిర్మలమైన ప్రేమా తలుచుకుంటే కళ్ళలో నీళ్ళు తిరిగేవి. ఓమారు వదిన దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది.

ప్రియమైన మఱది గోపీకి మీ వదిన దీవించి వ్రాయునది క్షేమం. నీవూ క్షేమమేనని తలుస్తాను. మీ అన్నయ్య నిన్ను గురించి చాల చెప్పారు. మామయ్య నీ రాకకై వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. నీ యింటికి నీవు రావడానికి సంకోచం ఎందుకు! తప్పులు చేయడం అనేది మానవ సహజం. చేసిన తప్పుకు పశ్చాత్తాపం చెంది సరైన మార్గంలో నడవడం ఉత్తమ మానవలక్షణం. పశ్చాత్తాపాగ్నిలో కాలే నీ హృదయంలో మలినం చేరేందుకు చోటు లేదు. చిన్నతనంలో అదుపు ఆజ్ఞాలేని పెంపకమే నీభవిష్యత్ను నాశనం చేయించింది. వయస్సుతోపాటు మనస్సూ వికసించినా సరైన ఆధారంలేకపోతే బాగుపడలేవు. అందుకే విడుదల అయిన వెంటనే ఎక్కడా జాగుచేయక ఇంటికి వచ్చేసెయ్! వీలైతే మీ అన్నయ్య వస్తారు. మీ నాన్నగారి మనస్సునకు శాంతిని చేకూర్చిన వాడవవుతావు పాపాయి చిన్నాన్నను చూడాలని వువ్విళ్ళూరుతోంది. మేమందరము నీ విడుదలకై ఎదురుచూస్తూ యున్నాము.

ఆశీస్సులతో నీ వదిన రాధ

ఆ ఉత్తరం గోపీపై పన్నీటి జల్లు కురిపించినట్లయింది. తన వదిన ఎంత మంచిది! ఎంత సహృదయంతో ఆహ్వానించుతోంది! అన్నయ్య చెప్పినమాట అబద్ధంకాదు. తాను వెళ్ళి తన ప్రవర్తనచే అందరి మెప్పునూ సంపాదించాలి. లక్ష్మణుడులాంటి మరదినని వదిన చేత అనిపించుకోవాలి.

పూజ్యురాలూ, లక్ష్మీ సమానులైన వదిన పాద పద్మములకు గోపీ నమస్కరించి వ్రాయునది. వదినా, నీవు వ్రాసిన జాబు చేరింది. అంధకారంలో కాంతి కిరణంలా, ఎడారిలో ఒయాసిస్ లా ఈ ఎండిన బీడులాంటి హృదయంపై పన్నీటి వర్షం కురిసింది. అన్నయ్య పిలుపుకన్న గృహలక్ష్మివైన నీ ఆహ్వానమే నాకు నిజమైన ఆనందాన్ని చేకూర్చింది. దొంగననైనా మనస్సులో తలచక నా రాకకై నిరీక్షించే నీలాంటి సహృదయం గలిగిన వదినను పొందిన నా భాగ్యంఏమని కొనియాడను! పశ్చాత్తాపం అనేది ఏనాడో కలిగింది కాని తగిన అవకాశమే దొరకలేదు. అన్నయ్య నాన్న ఎంతో గౌరవంగా బ్రతుకుతున్నారు. నారాక వారికి బాధ కలిగించుతుందేమోనని మీ వద్దకు రాలేకపోయాను. నీ ఆహ్వానం నా హృదయంలో మిగిలివున్న మలినాన్ని కడిగేసింది. విడుదల ఆయిన వెంటనే మీ సమక్షంలో వ్రాలతానని నాన్నకు అన్నయ్యకు చెప్పగలవు. పాపాయితో ఆడుకొనేందుకు చిన్నాన్న వస్తాడని చెప్పు.

నమస్కారములతో

నీ మఱది

గోపీ

ఈ ఉత్తరం వ్రాసిన కొన్ని దినాలకు గోపీ విడుదల పొందాడు.

«మీ అన్నయ్య రావడానికి వీలుకలుగలేదట. నీకు డబ్బు పంపారు. వెంటనే ఇంటికి వెళ్ళిపో" అంటూ జైలు అధికారి డబ్బిచ్చాడు. బజారువెళ్ళి ఒక జత సాదా బట్టలు కొనుక్కొని శుభ్రంగా తయారయి రైలెక్కాడు. తన ఊరి సంత పొలాలూ, చెఱువుగట్లూ తన అందమైన ఇల్లూ అన్నీ గుర్తు రాసాగాయి. తన వూరు వెళ్ళాలంటే మధ్యలో రైలు మారాలి. అక్కడ దిగాడు. సాయంత్రంవరకూ తన ఊరెళ్ళే బండిలేదు. రైల్వే హోటల్ లో కాఫీ ఫలహారాలూ తీసుకొని ప్లాట్ ఫారంమీద నడుస్తున్నాడు. ఇంతలో వెనకనుంచి ఓ చేయి భుజంమీద పడింది. వెనక్కి తిరిగాడు. నల్లగా మాసిన బట్టలతో పెరిగిన గెడ్డంతో వికార స్వరూపంతో తన మిత్రుడు రాజు కనిపించాడు. గోపీ గుండె జల్లుమన్నాయి. ఏం మాట్లాడలేక అలాగే చూస్తూండిపోయాడు.

'ఏరా గోపీ! మర్చిపోయావా!'

'లేదు రాజూ! అలా వున్నావేమిటా అని చూస్తున్నాను.'

(తరువాయి 23 వ పేజీ)

# వెన్నంటిన చీకటి ఛాయలు

(10 వ పేజి తరువాయి)

'ఏం చేయమంటావు గోపీ! మీ వదినకు చాల జబ్బుగా వుంది. చేతిలో పైసాలేదు. తినేందుకు తిండికీ కట్టుకుందుకు గుడ్డకూ మొహం వాచాము. కష్టపడి పని చేయడమూ అలవాటు లేదు. ఈ రోజుల్లో మనచేత దొంగతనాలు చేయించుకొనే వాళ్ళెవరు న్నారు! రెండుసార్లు డబ్బు దొరక్కపోగా చావుతప్పి కన్ను లొట్టబోయినట్లు జైల్లో పడకుండా బయటబడ్డాను. ఈ స్థితిలో నన్నెవరు చూచినా దొంగనే తలుస్తారు! అలాంటప్పుడు దగ్గరకు రానిస్తారా!'' గోపీ ఏమీ మాట్లాడలేదు.

'మళ్ళెప్పుడు బయటకొచ్చావురా'

'నిన్ననే'

'నిన్న బయటబడి అప్పుడే ఎక్కడ ఛాన్సు కొట్టావ్! బాగా వేషం బనాయించావ్!'

'దొంగతనం చేయలేదు రాజూ! మా అన్నయ్య సంపాదు. ఇప్పుడు అక్కడికే వెడుతున్నాను.' అంటూ తన అన్నయ్య తనను చూచింది మొదలు జరిగిన సంగతులన్నీ చెప్పాడు.

'వెళ్ళిపోదువుగానిలే గోపీ! కాని నాకు సహాయంచేసిమాత్రం వెళ్ళు!'

'నాదగ్గర ఓ ఐదురూపాయిలున్నై రాజూ కావాలంటే తీసుకో!''

'ఐదు రూపాయిల్తో తీరే కష్టంకాదు గోపీ! మీ వదినను బ్రతికించాలి. డబ్బు లేందే మందులురావు. గవర్నమెంటు ఆస్పత్రి రంగునీళ్ళతో ఎక్కువయిందేగాని తగ్గలేదు. అది లేకపోతే నా పరిస్థితి ఎంత దిగజారిపోతుందో నీకంటే ఎవరికి ఎక్కువ తెలుసు! నేనీపరిస్థితుల్లో ఏంచేసినా పట్టుబడటంతప్ప మరేం లేదు. నే వెళ్ళి జైల్లో కూర్చుంటే నా కుటుంబంగతేంగాను! గోపీ నన్ను రక్షించాలి!'

'నన్నేం చేయమంటావ్!' అన్నాడు నుదురురాసుకుంటూ గోపీ.

'నీవు తలుచుకుంటే చేయలేనిదేం లేదు గోపీ! నీ సమర్థతా తెలివితేటలూ నాకు తెలుసు. ఈ విశాలమైన రైల్వేస్టేషనులో జేబుల్లో పర్సులతో వంటినిండా నగల్తో ఎంతోమంది స్త్రీ పురుషులు తిరుగుతుంటారు. ఇద్దరం భాగం పంచుకుందాం!'

ఈ రోజుల్లో మనచేత దొంగతనాలు చేయించుకొనే వాళ్ళెవరు రాజూ!'

నా మాట నాకే అప్పగించుతున్నావా గోపీ! అది నీకు వర్తించదు నాలాంటి దౌర్భాగ్యులకేగాని, గోపీ! నాకుటుంబాన్ని కాపాడు.' అంటూ చేతులు పుచ్చుకున్నాడు.

'రాజూ! నన్ను మళ్ళీ ఆ గోతులోకి దించకు నీకు పుణ్యం ఉంటుంది. నా అన్నయ్య నన్నెంతో బతిమాలుకున్నాడు. నా వదిన ఎంతో ఆదరంగా ఉత్తరం వ్రాసింది. నా తండ్రి నాకై ఎదురుచూస్తుంటాడు. ఇంక దొంగతనం చేయనని వాళ్ళకు మాటిచ్చాను. నన్ను క్షమించి వదిలేసెయ్ రాజూ! నీ కెంతో పుణ్యం వుంటుంది. నా దారికి అడ్డు రాకు నన్ను పోనియ్.' అన్నాడు గోపీ దీనంగా.

'గోపీ! నిన్నేపరిస్థితిలో యాచించానో నీవు ఆలోచించుకో. నిన్ను మీ వాళ్ళవద్దకు పోవద్దనడంలేదు నాకీ సహాయం చేసి వెళ్ళు ఒకనాడు పట్టుబడి తన్నులుతిని చచ్చేస్థితిలో ఉంటే నా యింటికి తీసుకెళ్ళి ఎంత సేవ జేశానో గుర్తుందా! నా భార్య నిన్నెలా కంటికి రెప్పలా కాపాడిందో మర్చిపోయావా! ఆ స్థితిని మర్చిపోయి ఈనాడిలా మాట్లాడుతున్నావ్, అప్పుడు నీ అన్నా వదినా ఏమయ్యారు! ఈ నీతులన్నీ ఎక్కడికి పోయినాయ్, అసమర్థుడినై నీ కాళ్ళు పట్టుకుంటే ఇదేనా గోపీ నీవు నాకుచేసే సహాయం. నా భార్య పోతే నా బ్రతుకెలా మారుతుందో ఊహించలేవట్రా నువ్వు ఎన్నిసార్లు నేను సంపాదించిన డబ్బులో భాగంపెట్టాను! అవన్నీ ఎలా మర్చిపోయావురా గోపీ. అప్పుడే ఇప్పుడు నీవు జేబుదొంగ గోపీవి, రాజు మిత్రుడివి కావు. ఓ గొప్ప ఉద్యోగి తమ్ముడివి. కాబోయే భూస్వామివి. నీకూ నాకూ స్నేహం ఎక్కడ వెళ్ళు. గోపీ వెళ్ళు నా ముందునుంచి వెళ్ళు. అంటూ వకవకా వెళ్ళిపోసాగాడు రాజు.

గోపీ తల తిరిగిపోయింది. అవును. ఎన్నో సార్లు రాజువలన సహాయం పొందిఉన్నాడు. ఆ భార్యా భర్తలు తననెంతో ఆదరంగా చూచారు, కాని ఏమిటీపరీక్ష! అన్న వదినల మాటను ఎలా తీసివేయడం! వాళ్ళకు చేసిన వాగ్దానాన్ని ఎలా అతిక్రమించడం! కాని... రాజు ... జేబుదొంగే కావచ్చు. తన విషయంలో ప్రాణాలైనా ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. తన దగ్గర డబ్బులేదు వెళ్లగానే అన్నయ్యను అడగటమెలా! వాళ్లదగ్గర ఉంటుందని మాత్రం నమ్మకం ఏమిటీ! సరే రాజుకెలాగో సహాయంచేసి వెళ్ళిపోవడమే బావుంటుంది, తన స్వార్థానికేమీ కాదుగదా! తన ఊళ్ళు వడితే ఈ మిత్రులూ, ఈ పరిసరాలు ఉండవు తను చెప్పకపోతే అన్నయ్య వదినలకు ఎలా తెలుస్తుంది? ప్లాటుఫారం చివరకు వెళ్ళి సిమెంటు బెంచీమీద కూర్చున్న రాజు దగ్గరకు వెళ్లాడు గోపీ, గోపీ నిర్ణయం విని రాజు సంతోషించాడు. ఇరువురూ అక్కడే కూర్చున్నారు. ఓ యువతి మూడేళ్ల పిల్లనెత్తుకొని ఆ బెంచీవెనక నున్న పంపుదగ్గర నీళ్లు పట్టేందుకు వచ్చింది ఆవిడ మెడలోనేగాక ఆ పిల్ల మెళ్ళోకూడా బంగారు గొలుసు ధగ ధగ మెరుస్తోంది. గోపీలేచి అక్కడకువెళ్లాడు. ఆవిడ పిల్లకు మంచినీళ్లు పట్టింది మరచెంబులో నీళ్లు పట్టుకొనే సమయంలో తల్లి వెనకనున్న పిల్ల మెడలో గొలుసు లాగేసి పూలచెట్లు చాటునుంచి బయటకొచ్చేశాడు. ఆ తర్వాత రాజు వచ్చి గోపీని కలిశాడు.

'ఆవిడ గొలుసు చూచుకుందా!'

'ఆ! నువ్వు తీశావనే అక్కడున్న వాళ్లతో చెప్పింది. నన్నేమైనా అడుగుతారేమోనని తప్పించుకుని వచ్చాను.' అన్నాడు.

ఆ గొలుసు రాజు చేతికిచ్చాడు గోపీ

'అమ్మేసి భాగం పంచుకుందాంరా' అన్నాడు రాజు

'క్షమించు రాజూ! ఇంక నన్ను వదిలేసెయ్!' అంటూ రిక్షా ఎక్కి బస్‌స్టాండుకు వచ్చాడు గోపీ.

అతనికి శరీరమంతా సూదులతో పొడుస్తున్నట్లుంది. పెదవులు కంపించుతున్నాయి. నడక తడబడుతోంది. కళ్లలో తల్లీపిల్లలే మెదుల్తున్నారు. వాళ్లెవరో తెలిస్తే బావుండు. ఎప్పటికైనా ఆ నగ విలువవాళ్లకిచ్చేయాలి. ఈ విషయం అన్నయ్యకు తెలిస్తే ఎంత బాధపడతాడు! మారతాడనుకున్న మఱిది ఇలా చేశాడేమిటా అదిన అసహ్యించుకోదూ! వచ్చిన రెండుగంటలవరకూ బస్ దొరకలేదు. చివరకెలాగైతేనేం తనఊరు చేరుకున్నాడు అప్పటికే సూర్యుడు పడమటి కొండలచాటుకు వెళ్లిపోయాడు. నిశాదేవి నెమ్మది నెమ్మదిగా పైకొస్తూంది. పూర్వంకన్నా అభివృద్ధి పొందిన తన ఊరిని కిరోసిన్ దీపాలకు బదులుగా వెలసిన విద్యుద్దీపాలనూ, డాబాయిళ్లను, బ్లాక్ ఆఫీసునూ చూస్తూ 'జన్మభూమి ... కన్నతల్లి' అనుకుంటూ తన యింటిదగ్గర కొచ్చాడు. ఇంటిముందు ఖాళీస్థలంలో చక్కని పూలమొక్కలతో అందమైన తోట వెలసింది. చుట్టూ సిమెంటు గోడలూ, గేటూ ఠీవిగా చూస్తున్నాయి. తరువాత యిల్లు సున్నంతో రంగులతో అలంకరించబడి నూతన గృహంలా వెలిగిపోతోంది. అతని శరీరం పులకించింది. పడినబాధా, శ్రమా మాయమై పోయాయి. గేటుతీసే సమయంలో వరండాలో లైటు వెలిగింది. ఓ స్త్రీ పిల్ల నెత్తుకొని బయటకొచ్చి 'ఎవరూ!' అంది. ఆవిడను చూచేసరికి గోపీ ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి అదేచీర, అదే ఆకారం అదేచూపు...ఆవిడే తనపడిన... ఆవిడే! వెనక్కితిరిగి రైలుకట్ట కళ్లేదారి పట్టాడు. చీకటి ఉధృతంగా వ్యాపించుతూ అతన్ని తరుముకు రాసాగింది. వెలుగులోకి రావాలన్నా ఆ చీకటితాలూకు ఛాయలు వెన్నంటుతూనే ఉన్నాయి కన్నీటితో తడిసిన చెంపలతో బరువైన హృదయంతో చీకట్లో ఒదిగి కూర్చున్నాడు రైలుకోసం ఎదురుచూస్తూ... నిశి వెక్కిరించుతూంది.

తన అన్నకూతురు నగను తను అపహరించడం...గోపీ తనలో తను నవ్వుకున్నాడు ఏడవలేక.

---


# FORM IV
(See Rule 8)

1. Place of Publication : Machilipatnam, Dist. Krishna.
2. Periodicity of its publication : Fortnightly.
3. Printer's Name : KANCHI VASUDEVA RAO,
   Nationality : Indian, Hindu.
   Address : Kojjillipet, Machilipatnam. Dist. Krishna.
4. Publisher's Name : ,,
   Nationality : ,,
   Address : ,,
5. Editor's Name : ,,
   Nationality : ,,
   Address : ,,
6. Names and addresses of individuals who own the news-paper and partners or share holders holding more than one percent of the total Capital. ,,

I, KANCHI VASUDEVA RAO, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date 28-2-1965. *Signature of Publiher.*

*(Sd.) Kanchi Vasudeva Rao.*



చదవండి — చందాదారులుగా

చేరండి.

ఆంధ్రుల అభిమాన పక్షపత్రిక

చుక్కాని

సాలు చందా 4-50 విడిప్రతిక 20 న॥పై॥